సాక్షి
మంచిర్యాల
మంగళవారం : 2 : ఏప్రిల్ : 2024



వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త
జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఎల్లో అలర్ట్‌ను వాతావరణ శాఖ జారీ చేసింది. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో▸

రంజాన్ వేళలు
మంగళ : ఇఫ్తార్ 6:31
బుధ : సహర్ 4:46

గరిష్టం/కనిష్టం 40.0 /27.0

వాతావరణం
ఆకాశం ఉదయం వేళ ప్రకాశవంతంగా, రాత్రి వేళ మేఘావృతమై ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

చెన్నూర్‌రూరల్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో మోహన్, ఐకేపీ ఏపీఎం ప్రమీల పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి
వేసవిలో తాగునీటి కొరత లేకుండా చూడాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా నిర్వహణలో భాగంగా మండలంలోని నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధి రాయిపేట గ్రామాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. వాటర్‌ట్యాంకును పరిశీలించి లీకేజీకి మరమ్మతులు చేయించాలని అన్నారు. ఎంపీడీవో మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరిత, ఎంపీవో అజ్మత్‌అలి పాల్గొన్నారు.

'పది' మూల్యాంకనంలో నిబంధనలు పాటించాలి

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 3న ప్రారంభం కానున్న పదో తరగతి మూల్యాంకన విధుల్లో ఉపాధ్యాయులు నిబంధనలు పాటించాలని జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్(ఏసీజీఈ) దామోదర్‌రావు తెలిపారు. ఈ నెల 3నుంచి 11 వరకు కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మూల్యాంకనం నిర్వహిస్తామని తెలిపారు. అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు ఏడుగురు, చీఫ్ ఎగ్జామినర్ 66, అసిస్టెంట్ ఎగ్జామినర్ 384, స్పెషల్ అసిస్టెంట్లు 128 మందిని నియమించినట్లు తెలిపారు. విధులకు హాజరయ్యే వారు సెల్‌ఫోన్లు వాడొద్దని, ఉదయం 8గంటలకే రిపోర్టు చేయాలని సూచించారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఖర్జూరాలు తినిపిస్తున్న ఎమ్మెల్యేలు

బెల్లంపల్లి: ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ అన్నారు. సోమవారం బెల్లంపల్లిలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ముస్లింలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.సూరిబాబు, సీహెచ్.శంకర్, దావ రమేష్, గౌస్, అమానుల్లాఖాన్, అన్వర్‌ఖాన్, జయరాం యాదవ్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం సేకరించాలి



మాట్లాడుతున్న సబావత్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతుల నుంచి నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి కొనుగోలు కేంద్రాల ఏపీఎంలు, సీసీలతో ధాన్యం కొనుగోళ్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోతిలాల్ మాట్లాడుతూ ధాన్యం తూకానికి ముందే రైతుల నుంచి కూపన్, బ్యాంక్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం నకలు పత్రులను తీసుకోవాలని, ఆ వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసి ధాన్యం కొనుగోలు చేసిన రశీదు జారీ చేయాలని తెలిపారు. 48గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గన్నీ సంచులు చిరిగి ఉన్నట్లయితే పౌరసరఫరాల శాఖ కార్యాలయం టోల్‌ఫ్రీ నంబర్‌కు 63039228682 తెలియజేయాలని అన్నారు.

ఆదాయం అంతంతే..!



మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు



ఆర్టీఏ కార్యాలయం

- గత ఆర్థికంతో పోలిస్తే తక్కువే..
- జిల్లాలో రాబడి లక్ష్యం చేరని శాఖలు
- ముగిసిన 2023–24 ఆర్థిక సంవత్సరం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సర్కారు ఖాజానాకు ఆదాయ వనరులుగా ఉన్న ప్రభుత్వ శాఖల్లో జిల్లా నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరం రాబడి అంతంత మాత్రంగానే వచ్చింది. గత ఏడాది చివరి త్రైమాసికంలో అసెంబ్లీ ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ ఆదాయంతో ఆశించిన మేర ఆయా శాఖల్లో ఆదాయం నమోదు కాలేదు. జిల్లా నుంచి ప్రధాన ఆదాయ వనరులైన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు, రవాణాశాఖలో గతంతో పోలిస్తే తగ్గుదల నమోదు కాగా, ఆబ్కారీ, వాణిజ్య పన్నుల శాఖ నుంచి గత ఆర్థిక సంవత్సరం కంటే అధికంగా రాబడి వచ్చింది. గత మార్చి 31తో 2023–24 ఆర్థిక సంవత్సరం ముగిసి ఈ నెల ఒకటి నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఆ మేరకు ఆయా శాఖలకు లక్ష్యాలను విధించారు.

పెరిగిన లావాదేవీలు, తగ్గిన ఆదాయం
జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం ఒడిదుడుకులతో ఆర్థిక సంవత్సరంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో డాక్యుమెంట్ల లావాదేవీలు పెరిగినా, ఆదాయం కొద్దిమేర తగ్గింది. ఎల్‌ఆర్‌ఎస్, రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ఆశించిన మేర ఈ శాఖ నుంచి ఆదాయం రాలేదు. జిల్లాలో మంచిర్యాల, లక్సెట్టిపేట పరిధిలో రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో స్టాంపుల అమ్మకం, రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు తదితర లావాదేవీలు జరుగుతున్నాయి. లక్సెట్టిపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో గత ఏడాది రూ.5.66కోట్లు ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.5.26కోట్లు మాత్రమే వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో కంటే ఈసారి రూ.39.64లక్షల తగ్గుదల నమోదైంది.

మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు

సంవత్సరం	డాక్యుమెంట్లు	రూ.కోట్లు
2022–23	20,038	57.08
2023–24	20,173	53.01

మద్యం ఆదాయం పైపైకి..
2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మద్యం అమ్మకాల్లో వృద్ధి నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినా పెరిగింది. గత ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో మద్యం అమ్మకాలు పెరగడంతోపాటు కొత్త విధానం దరఖాస్తులతోనూ ఆదాయం వచ్చింది. ఐఎంఎల్(ఇండియన్ మేడ్ లిక్కర్) కాకుండా బీర్ల ఆదాయం పెరిగింది. జిల్లాలో 73 వైన్స్‌లు, 16బార్లు ఉన్నాయి. ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాల విలువ చూస్తే రూ.703.47 కోట్లకు చేరింది. గతేడు అమ్మకాలు చూస్తే రూ. రూ.676.68 కోట్లు ఉంది. ఈ లెక్కన రూ.26.79కోట్ల మేర మద్యం అమ్మకాలు పెరిగాయి.

వాణిజ్య పన్నుల శాఖలో పెరుగుదల
సర్కారు ఖాజానాకు ఆదాయాన్ని ఇచ్చే మరో కీలక శాఖ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ. జిల్లా నుంచి ఏటా రూ.కోట్లలోనే ఆదాయం అందుతోంది. రాష్ట్ర వస్తు, సేవల పన్ను(ఎస్‌జీఎస్‌టీ), అమ్మకపు పన్నుల, జీఎస్టీ, వ్యాపారుల డీలర్‌షిప్‌ల లైసెన్స్‌లు, కాంట్రాక్టర్లు, రెన్యూవల్, పన్నుల చెల్లింపులు, జరిమానాలతో ఆదాయం వస్తుంది. జిల్లాలో వాణిజ్య పన్నుల శాఖకు ఆదాయాన్ని సిమెంటు, స్టీల్, ఇతర వ్యాపారాల నుంచి రూ.కోట్లలో సమకూరుతోంది.

గతేడాది ఆదాయం	రూ.90.12కోట్లు
ఈ ఏడాది	రూ.95.89కోట్లు
పెరుగుదల	6.40శాతం

లక్ష్యం చేరని రవాణా శాఖ
జిల్లా రవాణా శాఖ పరిధిలో ఉన్న వాహనాలకు త్రైమాసికం, జీవిత కాలం, ఫీజులు, సేవ పన్ను, తనిఖీల్లో వేసిన జరిమానాలతో ఈ శాఖకు ఆదాయం వస్తుంది. జిల్లాలో ఇటీవల వాహనాల కొనుగోళ్లు పెరుగుతూ వస్తున్నాయి. అయితే రవాణా శాఖ ఈ ఏడాది విధించిన లక్ష్యాన్ని చేరుకోలేదు. దీంతో ఆదాయం స్వల్పంగా తగ్గింది.

2023-24సంవత్సరం

లక్ష్యం	రూ.70.16కోట్లు
వచ్చింది	రూ.69.21కోట్లు

నిరంతరంగా నీటి సరఫరా

- సీఎంఆర్ నిర్లక్ష్యం వహించిన అధికారులు, మిల్లర్లపై చర్యలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నిరంతరాయంగా సరఫరాకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఇతర శాఖల కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో తాగునీటి ప్రణాళిక, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పాఠశాలల మరమ్మతులు, వడదెబ్బల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ నిరంతర తాగునీటి సరఫరాకు జిల్లా అదనపు కలెక్టర్ల(స్థానిక సంస్థలు)ను జిల్లా తాగునీటి సరఫరా ఇన్‌చార్జీలుగా నియమించి మండల, గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి కార్యాచరణ రూపొందించాలని అన్నారు. తాగునీటిని సరఫరా చేయలేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని చెప్పారు. సీఎంఆర్‌లో నిర్లక్ష్యం వహించిన అధికారులు, రైస్‌మిల్లులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు, జిల్లా పౌరసరఫరాల అధికారి వాజిద్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా విద్యాధికారి యాదయ్య, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

ఖజానా అధికారిగా రాజగోపాల్



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా ఖాజానా అధికారిగా ఎస్.రాజగోపాల్ సోమవారం కలెక్టరేట్‌లోని ఖాజానా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వైద్య, ఆరోగ్య సేవల నియామక బోర్డు హైదరాబాద్‌లో అకౌంట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై జిల్లా ఖాజానా అధికారిగా ఇక్కడికి బదిలీ అయ్యారు. పెద్దపల్లి జిల్లా ఖాజానా శాఖ ఏటీవోగా విధులు నిర్వర్తిస్తున్న కే.రమేష్ జిల్లా ఖాజానా శాఖ ఏటీవోగా బాధ్యతలు చేపట్టారు.

డంపింగ్‌యార్డు తరలించండి..



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

- పది రోజుల్లో మళ్లీ వస్తాం..
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు
- ఆండాళమ్మ కాలనీ డంపింగ్ యార్డు పరిశీలన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఆండాళమ్మ కాలనీలో ఉన్న డంపింగ్‌యార్డును వీలైనంత త్వరగా తరలించాలని, చెత్తను కాల్చొద్దని, బయోమైనింగ్ చేపట్టాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. డంపింగ్ యార్డుపై ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నహీంపాషా జాతీయ హరిత ట్రిబ్యునల్, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు చేసిన ఫిర్యాదు మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తెలంగాణ జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరు హనుమంతరెడ్డి, జోనల్ ఆఫీసర్ లక్ష్మణ్‌ప్రసాద్ సోమవారం మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి డంపింగ్‌యార్డు వల్ల పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. చెత్తకు నిప్పంటించడం వల్ల పొగ, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని, పొగతో శ్వాసకోశ సంబంధ వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ఈ సమస్యపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని కమిషనర్‌ను అధికారులు ప్రశ్నించగా.. సింగరేణి నుంచి డంపింగ్‌యార్డు కోసం 25ఎకరాల భూమి కోరామని, కేటాయించగానే డంపింగ్‌యార్డును అక్కడికి తరలించి చెత్తను రీసైక్లింగ్ చేసేలా ప్లాంటు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ రాహుల్‌ను అధికారులు కలిసి చర్చించారు. పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. దీంతో అధికారులు మళ్లీ పది రోజుల్లో వస్తామన్నారు.

కదలిక వచ్చేనా..?

- చెత్తను కాల్చే పొగతో స్థానికుల ఇబ్బందులు
- 'సాక్షి' కథనంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీకి చెత్త డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడంతో సేంద్రియ ఎరువుల తయారీకి ఏర్పాటు చేసిన డీఆర్‌సీసీ(పొడి వనరుల సేకరణ కేంద్రం)ను చెత్త డంపింగ్ యార్డుగా మార్చారు. గతంలో తడి, పొడి చెత్తను వేరు చేసినా ఆ తర్వాత రెండూ కలిపి సేకరించి వేయడంతో గుట్టలుగా పేరుకుపోతోంది. ఏదో ఒక చోట నిప్పంటుకుని పొగ, దుర్వాసనతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పలుమార్లు చెత్త వాహనాలను అడ్డుకుని ఆందోళనలు నిర్వహించారు.

'సాక్షి' కథనంతో ఫిర్యాదు
చెత్తను కాల్చడం, నిల్వలతో స్థానిక ప్రజల ఇబ్బందులు, చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడడంపై గత ఏడాది మే 4న 'సాక్షి'లో 'చెత్త చిక్కులు..?' శీర్షికన ప్రచురితమైన కథనం ఆధారంగా ఆమ్ ఆద్మీ పార్టీ నేత ఎండీ.నహీంపాషా అదే నెలలో సెంట్రల్ పొల్యూషన్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. చర్యలు లేపోవడంతో అదే ఏడాది సెప్టెంబర్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)కు వెళ్లారు. దీంతో ఇటీవల కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సమావేశమై డంపింగ్ యార్డుపై చర్యలు తీసుకోవాలని ఎన్జీటీ సూచించింది. ఈ నేపథ్యంలోనే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు డంపింగ్ యార్డును సందర్శించారు.

శాశ్వత పరిష్కారమేది..
పట్టణంలో ప్రతీ రోజు 45మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. హాజీపూర్ మండలం వేంపల్లి శివారులో 21 ఎకరాలు డంపింగ్‌యార్డుకు సేకరించి చెత్త వేశారు. ఆ ప్రాంతంలో పంట పొలాలు ఉండడంతో గ్రామస్తులు హైకోర్టుకు వెళ్లారు. నస్పూరు మున్సిపాలిటీలోని సింగరేణి స్థలం ఎనిమిది ఎకరాల్లో కొన్నాళ్లపాటు చెత్త వేశారు. అక్కడా గుట్టలుగా పేరుకుపోవడం, చెత్త కాల్చడంతో పొగ, దుర్వాసన వెలువడి ఆ ప్రాంత ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ శివారులో 8 ఎకరాలు డంపింగ్ యార్డుకు కేటాయించారు. కానీ ఆ స్థలంలో పెద్ద పెద్ద గుంతలు, అందులో నిలిచి ఉన్న నీటి వల్ల చెత్త వేసేందుకు అనువుగా లేదు. తాత్కాలికంగా పలు ప్రాంతాలను ఎంపిక చేస్తున్నారే గానీ శాశ్వత పరిష్కారం చూడడం లేదు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఐకేపీ ద్వారానే 'కొనుగోలు'!

- మంచిర్యాల నియోజకవర్గంలో ఆ ఏజెన్సీకే..!
- ధాన్యం సేకరణలో ఏజెన్సీలపై ఆంక్షలు



హాజీపూర్ మండలం దొనబండలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో యాసంగి వరి ధాన్యం సేకరణ మూడు ఏజెన్సీల ద్వారా చేపట్టాలని నిర్ణయించగా.. మంచిర్యాల నియోజకవర్గంలో ఐకేపీ సెంటర్లు మాత్రమే ఏర్పాటు చేయాలని అధికారులు నిర్వాహకులను ఆదేశిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలో ఐకేపీ 11, పీఏసీఎస్ 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఏ ఏజెన్సీకి ఎన్ని కేటాయించడం, జిల్లాలో మొత్తం ఎన్ని కేంద్రాలు అనేది నిర్ణయించకముందే ప్రారంభించారు. గతంలో అధికారులు ఇష్టానుసారంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఈ సీజన్‌లో తాము చెప్పిన విధంగా ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తుండడంతో అధికారులు తల పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో డీఆర్డీఏ(ఐకేపీ), పీఏసీఎస్, డీసీఎమ్మెస్ ఏజెన్సీల ద్వారా ధాన్యం సేకరించి మిల్లులకు తరలించాలని నిర్ణయించారు. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో పీఏసీఎస్, డీసీఎమ్మెస్, ఐకేపీ ఆధ్వర్యంలో కేంద్రాలు, మంచిర్యాల నియోజకవర్గంలో వలం ఐకేపీ కేంద్రాలు మాత్రమే ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిసింది. సోమవారం ఐకేపీ కొనుగోలు కేంద్రం మాత్రమే ప్రారంభించారు. ఒకే ఏజెన్సీ ద్వారా ధాన్యం సేకరిస్తే రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని నిర్వాహకులు వాపోతున్నారు.

ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే..?
గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఇష్టానుసారం కొనుగోలు కేంద్రాలను వారికి అనుకూలమైన వారికి కట్టబెట్టడంతోపాటు నచ్చిన చోట ఏర్పాటుకు చక్రం తిప్పారని, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారడంతో ఆ కేంద్రాలను రద్దు చేయాలని, కేటాయింపుల్లోనూ రాజకీయం చోటు చేసుకుంటోంది. గతంలో కొన్ని కేంద్రాల్లో అక్రమాలు జరిగాయని, వాటిని మార్చాలని, అక్కడ ఆ ఏజెన్సీలకు ఇవ్వకూడదని అధికారులపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో 262 కేంద్రాలు..
జిల్లాలో యాసంగి సీజన్ వరి ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో మొత్తం 262 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. మంచిర్యాల నియోజకవర్గంలో ఐకేపీ ఏజెన్సీ ద్వారా ధాన్యం సేకరణ చేపడుతాం.
– జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్
- ఎన్నికల సిబ్బందికి శిక్షణ



శిక్షణలో ట్రైనర్లు చెబుతున్న అంశాలను వింటున్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో ప్రతీ అంశంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలని, హ్యాండ్‌బుక్‌పై పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. జిల్లాలో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరు వివరించడంతోపాటు పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఫారం నింపే విధానంపై అవగాహన కల్పించారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి
చెన్నూర్: ఎన్నికల్లో పీవోలు, ఏపీవోలు అప్రమత్తంగా ఉండాలని, శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పీవోలు, ఏపీవోలకు నాలుగు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం శిక్షణ తరగతులను సందర్శించారు. రోజుకు 360 మంది చొప్పున నియోజకవర్గంలోని అన్ని మండలాల పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో చంద్రకళ, డీఆర్‌డీవో కిషన్, తహసీల్దార్లు మల్లికార్జున్, చంద్రశేఖర్, వనజ, సదానందం, డిప్యూటీ తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

వాహనాల కొనుగోళ్లలో అక్రమాలపై ఫిర్యాదు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ వాహన కొనుగోళ్లలో అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని కౌన్సిలర్లు మున్సిపల్ అడిషనల్ డైరెక్టర్ జాన్ శ్యాంసన్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. జేసీబీ, మరో పాత జేసీబీ, 22 చెత్త సేకరణ ట్రాలీలు, స్వీపింగ్(రోడ్ క్లీనర్) మిషన్, ట్రాక్టర్లు కొనుగోలు చేశారని తెలిపారు. ఆర్టేషన్ వాహనాలను తీసుకొచ్చి కమీషన్లు తీసుకున్నారని పేర్కొన్నారు. నాసికరం వాహనాలకు బిల్లులు మంజూరు చేస్తూ మున్సిపల్ ఏఈ, డీఈలు తమ వ్యక్తిగత ప్రయోజనాలు పొందుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఏఈ కొందరు రాజకీయ నాయకుల అండదండలతో బదిలీ కాకుండా ఉంటున్నారని తెలిపారు. డీఈ డిప్యూటేషన్‌పై వచ్చారని, మున్సిపల్ సమావేశం రోజు తప్పా మిగతా రోజుల్లో కనిపించరని తెలిపారు. రూ.7కోట్ల అంచనాతో ప్రారంభించిన కూరగాయల మార్కెట్ వారి నిర్లక్ష్యం వల్లే నాలుగేళ్లుగా పూర్తి కాలేదని పేర్కొన్నారు. డంప్‌యార్డు ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్‌పరిధిలో వెళ్తుందని తెలిసినా రూ.3 కోట్ల విలువైన పనులు చేయించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోసిక రమేష్, షేక్ అఫ్సర్, ఎస్.లావణ్య, జిలకర తార, దామెర శ్రీనివాస్, కె.చంద్రశేఖర్, నెల్లి శ్రీలత, ఎలిగేటి సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు పత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భీమారం(చెన్నూర్): మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై భీమారం బస్టాండ్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై రాములు తెలిపారు. భీమారం గ్రామానికి చెందిన చింత ప్రదీప్, రేవెల్లి దినకర్ బైక్‌పై బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

ప్రాణహితలో దూకి యువకుడి ఆత్మహత్య


ఉమేష్(ఫైల్)

బెజ్జూర్: ప్రాణహితలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ సాధిక్ పాషా తెలిపారు. బెజ్జూర్ మండలం బారెగూడెంకు చెందిన మురుమురే ఉమేష్ (25) ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. లంబాడిగూడ ప్రాణహిత కెనాల్ లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం రావడంతో సీఐ ఘటన స్థలాన్ని సందర్శించారు. దుస్తులు, చెప్పుల ఆధారంగా బారెగూడెం వాసిగా గుర్తించినట్లు తెలిపారు. మృతుడు కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడని తల్లి సరోజ తెలిపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం


అజ్గర్‌అలీ (ఫైల్)

తాండూర్(బెల్లంపల్లి): ఈ నెల 30న అదృశ్యమైన వ్యక్తి మృతదేహం సోమవారం లభించింది. తాండూర్ ఐబీ సుభద్రకాలనీకి చెందిన ఎండీ. అజ్గర్ అలీ (33) ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అబ్బాపూర్ ఓసీపీ ప్రాజెక్టు పరిసరాల్లో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న సీఐ, ఎస్సైలు కుమారస్వామి, జగదీష్‌గౌడ్ ఘటనాస్థలికి అజ్గర్ అలీ కుటుంబ సభ్యులను తీసుకెళ్లి చూపించారు. మృతుని చేతికి ఉన్న తాడు ఆధారంగా తనభర్త అజ్గర్ అలీనేనని అతని భార్య హర్షియా బేగం గుర్తించారు. మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతునిది హత్యా? ఆత్మహత్యా? తేలాల్సి ఉంది.

బొలెరో వాహనాలు ఢీ..

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని లింగాపూర్ పాల కేంద్రం సమీపంలో సోమవారం రాత్రి రెండు బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. టైల్స్‌లోడ్‌తో మేదరిపేట వైపు నుంచి కళపెల్లి వెళ్తున్న బొలెరో జన్నారం నుంచి లక్సెట్టిపేట వైపు చేపల లోడ్‌తో వెళ్తున్న మరో బొలెరో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లకు స్వల్పగాయాలయ్యాయి.

వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త

- జిల్లాలో అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ముందస్తు జాగ్రత్తలతో ఉపశమనం


జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా లక్ష్మీ థియేటర్ చౌరస్తా

మంచిర్యాలటౌన్: వేసవికాలంలో మార్చినుంచే ఎండలు మండుతుండడంతో జనం ముున్ముందు పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందోనని జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. జిల్లాలో ప్రతీరోజు 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో రోడ్లన్నీ ఉదయం 11 గంటల నుంచే నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. నిర్లక్ష్యంగా ఉంటే ప్రజలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది.

ఎల్లో అలర్ట్..
పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణ శాఖ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉందని, చిన్నారులు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు
వడదెబ్బ తగిలిన వారిలో కాళ్ల వాపులు, కళ్లు తిరగడం, శరీర కండరాలు పట్టుకోవడం, తీవ్ర జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక చెమట పట్టడం, తల తిరిగి పడిపోవడం వంటివి జరిగితే వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలి.

ప్రాథమిక చికిత్స
- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీరు, ఐస్‌తో ఒళ్లంతా తుడవాలి. వదులుగా ఉన్న నూలు దుస్తులు వేయాలి.
- చల్లని గాలి తగిలేలా ఉంచాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరిబోండాం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం(ఓఆర్ఎస్) తాగించవచ్చు.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు
- వేసవిలో డీహైడ్రేషన్ అధికంగా ఉంటుంది. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీడన/చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించండి.
- ఆల్కాహాల్/సిగరేట్/కార్బొనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండండి.
- ఎండలో వెళ్లేటప్పుడు కళ్లకు సన్ గ్లాసెస్, తలకు టోపీ వంటివి ధరించండి.
- వేసవిలో ఉదయం/సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి.
- వేడి వాతావరణంలో శారీరక శ్రమ కార్యక్రమాలు చేయడం మంచిది కాదు. ఒకవేళ చేస్తే ప్రతీ 20 నిమిషాలకు ఒకసారి 5 నిమిషాలు నీడలో ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో ఎక్కువగా ద్రవపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.
- ప్రయాణాల్లో సోడియం, ఎలక్ట్రోలైట్ వంటి ద్రావణాలను తాగడం మంచిది.

చేయకూడని పనులు
- మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు.
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినవద్దు. ఇంట్లో వండుకున్నవి మాత్రమే తినాలి.
- మాంసాహారం తగ్గించి, తాజా కూరగాయల్ని ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలి.
- నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్బూజ, తాటి ముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీని వల్ల కడుపు నిండినట్లుగా ఉండి, డైట్ కంట్రోల్ అవుతుంది.
- శీతల పానీయాలు, అధికంగా షుగర్ వేసిన జ్యూస్‌లు, మ్యాంగో, సపోటా వంటివి తీసుకుంటే బరువు తగ్గకపోగా, కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- వేసవిలో ఆకలి తక్కువగా దాహం ఎక్కువగా ఉంటుంది. జీర్ణక్రియలోనూ తేడాలు వస్తుంటాయి. డైట్ పాటిస్తూ కాలానికి అనుగుణంగా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి బరువును నియంత్రించవచ్చు. నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలి.

బయటకు వెళ్లొద్దు



ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. పిల్లలు, వృద్ధులతో పాటు ప్రజలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. అత్యవసరమైతే తలకు టోపి ధరించి వెళ్లాలి. చెమట రూపంలో శరీరంలోని లవణాలు బయటకు పోతాయి. అందుకే లవణాలతో కూడిన ద్రావణం తీసుకోవాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. ఇంట్లోనే ఉండే పిల్లలకు వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

అధికారులకు కోర్టు నోటీసులు

నెన్నెల(బెల్లంపల్లి): జెండావెంకటాపూర్‌లోని గోపి చెరువులో నిబంధనలకు విరుద్ధంగా చేపలు పట్టుకునే టెండర్‌ను అప్పగించిన అధికారులకు బెల్లంపల్లి కోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. టెండర్ ఖరారు చేయడంలో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని జెండా వెంకటాపూర్ మాజీ ఉపసర్పంచ్ ఏస్కూరి లచ్చయ్య మార్చి 11న బెల్లంపల్లి లీగల్ సర్వీస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా మత్స్య శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవో, ఎంపీవో, స్పెషల్ ఆఫీసర్లు ఏప్రిల్ 6న కోర్టులో హాజరుకావాలని నోటీసులు జారీ అయ్యాయి. ఏటా రూ.2 లక్షలకుపైగా టెండర్ పాడే చెరువుకు జీపీ తీర్మానం లేకుండానే కేవలం రూ.9 వేలకే అప్పగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు వివరించారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం


కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారి మహేశ్

ఆసిఫాబాద్: బాల్య వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ అన్నారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం మండలంలోని పర్శనంబాలకు వెళ్లి బాలిక కుటుంబ సభ్యులకు, కులపెద్దలకు కౌన్సిలింగ్ నిర్వహించి వివాహాన్ని వాయిదా వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల చట్టపరమైన ఇబ్బందులతో పాటు ఆరోగ్య పరమైన సమస్యలు వస్తాయన్నారు. అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం జరిపించాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట రక్ష భవన్ సిబ్బంది చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రవళి ఉన్నారు.

వివాదాస్పద భూముల్లో హద్దురాళ్లు అడ్డుకున్న రైతులు


రైతులతో మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో

భీమారం(చెన్నూర్): మండలంలోని అంకూసాపూర్ శివారులోని వివాదాస్పద భూముల్లో సోమవారం మంచిర్యాల ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు నేతృత్వంలో అటవీశాఖ సిబ్బంది హద్దురాళ్లు వేసేందుకు ప్రయత్నిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. అంకూసాపూర్ శివారు అటవీ ప్రాంతంలో 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు గత ప్రభుత్వ హయాంలో అటవీశాఖ సర్వే జరిపి తమకు రసీదులు ఇచ్చినట్లు రైతులు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం వచ్చేవరకు ఆ భూముల్లోకి రామని చెప్పిన అధికారులు ఇప్పుడు అకస్మాత్తుగా వచ్చి హద్దురాళ్లు వేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. దీంతో అటవీశాఖ అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రాములు ముందస్తు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేచిని రైల్వేస్టేషన్‌లో నో హాల్టింగ్

- మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 30 వరకు రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత


రేచిని రోడ్ రైల్వే స్టేషన్

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ అలంకార ప్రాయంగా మారింది. నిత్యం రాకపోకలు సాగించే ప్యాసింజర్ రైలు కూడా ఈ రైల్వేస్టేషన్‌లో ఆగడం లేదు. స్టేషన్ మరమ్మతులు, మూడోలైన్ పనుల దృష్ట్యా పలు రైళ్ల హాల్టింగ్‌లను ఏప్రిల్ 30 వరకు ఎత్తివేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని నెలలుగా దశలవారీగా ఒక్కో రైలు హాల్టింగ్ ఎత్తివేస్తూ వస్తున్నారు. ఇటీవలి కాలంలో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ మాత్రమే ప్రయాణికులకు ఈ రైల్వేస్టేషన్‌లో సేవలు అందిస్తుండగా ప్రస్తుతం ఆ సేవలు కూడా నిలిచిపోయాయి. కరీంనగర్–సిర్పూర్ కాగజ్‌నగర్ (పుష్పుల్–07765), హైదరాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్–17011), సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్–17233) రైళ్లు అప్ అండ్ డౌన్ హాల్టింగ్‌లు ఈ నెలాఖరు వరకు నిలిచిపోనున్నాయి. దీంతో రైలు ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో బెల్లంపల్లికి వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

పాల కోసం వెళ్తూ పరలోకానికి

- కారు ఢీకొని వ్యక్తి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దండేపల్లి(మంచిర్యాల): పాలకోసం వెళ్తున్న వ్యక్తిని కారు రూపంలో వచ్చిన మృత్యువు వెంబడించడంతో తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల మేరకు దండేపల్లి మండలం మాకులపేటకు చెందిన కొత్తపల్లి రాజేశం (62) సోమవారం ఉదయం పాలు తెచ్చేందుకు స్కూటీపై తాళ్లపేటకు వెళ్తుండగా నాగసముద్రం సమీపంలో అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఘటనలో రాజేశంకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుని భార్య సుమతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న దూరదర్శన్ కేంద్రం ప్రాంతీయ వార్తా కేంద్రం కింద స్ట్రింగర్ల ఎంప్యానల్‌మెంట్ కొరకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఎన్‌యూ, హెడ్, సంచాలకులు (వార్తలు) రాహుల్ గొలీకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ఈ నెల 30 వరకు గడువు ఉందన్నారు. అభ్యర్థులు దరఖాస్తు డిమాండ్ డ్రాఫ్ట్, అనుబంధ పత్రాలతో జతపరిచి గడువులోగా అందించాలన్నారు. మరిన్ని వివరాలకు www. prasarbharati.gov.in/pbvacancies వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చన్నారు.

4న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద, గౌరవ వేతన పద్ధతిన వివిధ విభాగాల్లో పని చేసేందుకు అర్హత గల అభ్యర్థులకు ఈనెల 4న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జునచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్స్–22, అసోసియేట్ ప్రొఫెసర్లు–27, అసిస్టెంట్ ప్రొఫెసర్స్–45, సీనియర్ రెసిడెంట్స్–21, అనాటమీ, ఫిజియోలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయోలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, వెనరాలజీ, సైకియాట్రి, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తాల్మజీ, ఆర్థోపెడిక్స్, అబ్‌స్ట్రిక్స్, గైనకాలజీ, అనస్థీసియా, రేడియాలజీ విభాగాల్లో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు స్వీయ ధ్రువీకరణ ప్రతులను జతపర్చి ఈ నెల 4న సాయంత్రం 4 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు www.gmckumurambheemasifabad.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భైంసారూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్, స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని బోకర్ తాలుకా కాండ్లి గ్రామానికి చెందిన గణేశ్(45) సోమవారం రాత్రి భైంసాకు వస్తున్నాడు. మండలంలోని టాక్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోలిండియా పోటీలకు ఎంపిక


రవికుమార్

మందమర్రిరూరల్: ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ఎన్సీఎల్‌లో జరిగే కోలిండియా కబడ్డీ పోటీలకు మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్‌లో శాంప్లింగ్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రవికుమార్‌ను ఏరియా జీఎం మనోహర్ అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి సింగరేణికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సమష్టి కృషితోనే ఉత్పత్తి లక్ష్యసాధన

మందమర్రిరూరల్(చెన్నూర్): ఉద్యోగుల సమష్టి కృషితోనే గత ఆర్థిక సంవత్సరం సంస్థ ఏరియాలోని కేకే–5 గనికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 98 శాతం సాధించామని గని మేనేజర్ అల్లావుద్దీన్ అన్నారు. సోమవారం గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి లక్ష్య సాధనలో భాగస్వాములైన ఉద్యోగులను అభినందించారు. సమావేశంలో సేఫ్టీ ఆఫీసర్ రమేశ్, అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్, సంక్షేమాధికారి కార్తీక్, గుర్తింపు సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో 89 శాతం ఉత్పత్తి

శ్రీరాంపూర్: 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిలో శ్రీరాంపూర్ ఏరియా 89 శాతం లక్ష్యాన్ని నమోదు చేసుకుంది. మార్చి 31 నాటికి ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఏరియాలోని అన్ని గనులకు కలిపి మొత్తం 66.4 లక్షల టన్నులు సాధించాల్సి ఉండగా 59 లక్షల టన్నులు సాధించింది. దీంతో 11 శాతం ఉత్పత్తిని తీయలేకపోయింది. మార్చిలో 5.6 లక్షల టన్నులు సాధించాల్సి ఉండగా 6 లక్షల టన్నులు సాధించి 120 శాతం నమోదు చేసుకుంది. ఆర్కే 5, ఆర్కే 6, ఆర్కే న్యూటెక్ గనుల మాత్రమే వందశాతం లక్ష్యాలను సాధించినట్లు కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న డీసీపీ అశోక్ కుమార్

మంచిర్యాలక్రైం: పార్లమెంటు ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు నిబంధనలు పాటించాలని మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ అన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఏ పార్టీకి చెందిన వారైనా, ఎంతటి వారైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు. ఎన్నికల ప్రచార ర్యాలీలు, మైక్ పర్మిషన్, సభలు, సమావేశాల కోసం సువిధ యాప్ ద్వారా అనుమతి తీసుకోవాలని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, సీఐ బన్సీలాల్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ ఎస్సైలు పాల్గొన్నారు.

గుర్తింపుపత్రం జాప్యానికి కారణం ఏఐటీయూసీ

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు


మాట్లాడుతున్న మంద నర్సింహారావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఎన్నికల్లో గెలిచినా ఇప్పటికీ గుర్తింపు పత్రం రాకపోవడానికి కారణం గెలిచిన ఏఐటీయూసీనేనని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడ్ ఆఫ్ డిసిప్లేన్ ప్రకారం గుర్తింపు సంఘం కాలపరిమితి రెండు సంవత్సరాలే అని, దీనిపై గతంలో ఆర్ఎల్సీ వద్ద నిర్వహించిన సమావేశంలో ఐదు సంఘాలు కలిసి విన్నవించడం జరిగిందన్నారు. ఇప్పుడు నాలుగేళ్లు ఉండాలని కోరుతూ సీఎల్సీకి ఏఐటీయూసీ లేఖ రాసిందన్నారు. అక్కడి నుంచి సమాధానం వచ్చేంత వరకు గుర్తింపు పత్రం తీసుకోవద్దనే ఉద్దేశంతో ఉందన్నారు. అందుకే గుర్తింపు పత్రం తీసుకోవడం లేదన్నారు. కానీ అన్ని రకాలుగా గుర్తింపు హోదాలో చలామణి అవుతోందన్నారు. సింగరేణిలో ఎంపీ ఎన్నికల పేరుతో బదిలీలను ఆపేశారని, కానీ పైరవీలు కేసులకు మాత్రం ఇది వర్తించడం లేదన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి, బ్రాంచి అధ్యక్షుడు గుల్లా బాలాజీ, నాయకులు కస్తూరి చంద్రశేఖర్, అంబాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు అండగా ప్రభుత్వం

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి


విజేతలకు మెమొంటో అందజేస్తున్న ఎమ్మెల్యే

భీమారం(చెన్నూర్): గ్రామీణ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. భీమారం మండల కేంద్రంలో నిర్వహించిన కాకా వెంకటస్వామి క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రధానోత్సవానికి సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతీ మండల కేంద్రంలో స్టేడియం నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పోటీల్లో భీమారం జట్టు ప్రథమ, మిట్టపల్లి జట్టు ద్వితీయ బహుమతులు సాధించగా వారికి మెమొంటోతో పాటు నగదు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పాడేటి రవి, బుక్యా లక్ష్మణ్, పోటు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి


అవగాహన కల్పిస్తున్న జయదీప్ పాటిల్

తాండూర్(బెల్లంపల్లి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని మల్టీ స్టేట్ కోఆపరేటివ్ నేషనల్ ఫిషరీస్ అధ్యక్షుడు జయదీప్ పాటిల్ అన్నారు. సోమవారం తాండూర్ మండల కేంద్రంలో మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి మత్స్యకారులకు వివరించారు. సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుంటేనే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మల్టీ స్టేట్ కోఆపరేటివ్ జిల్లా అధ్యక్షుడు పూలబోయిన భీమన్న, ఫిషరీస్ జిల్లా వైస్ చైర్మన్ కంపెల చిన్నయ్య, తాండూర్ కోఆర్డినేటర్ రెవెల్లి శ్రీనివాస్, మత్స్యకారులు పెద్దబోయిన మహేష్, కంపెల శ్రీనివాస్, పెద్దబోయిన శంకర్, పెద్దబోయిన రవి, ఉప్పుట్ల చంద్రశేఖర్, ఉప్పర్ల సంతోష్, మేడి శంకర్, మేడి సునీత, మేడి మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి


మాట్లాడుతున్న అధికారి రాహుల్

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల విధులకు ఎంపికైన అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి రాహుల్ సూచించారు. సోమవారం బెల్లంపల్లిలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ఈ నెల 18న జారీ అవుతుందని, నోటిఫికేషన్ విడుదల కాగానే ఎన్నికల తంతు ప్రారంభమవుతుందన్నారు. నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ, అభ్యంతరాల స్వీకరణ, ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థుల జాబితా వెల్లడించాల్సి ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. ఆ తీరుగా ఎన్నికలకు సంబంధించిన ప్రతీ అంశంపై అధికారులు, సిబ్బంది సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈసందర్భంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.